## క్లుప్తంగా

### మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా స్వప్న



**లింగంపేట(ఎల్లారెడ్డి):** లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు కమిటీని ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా సిలమంతుల స్వప్న, ఉపాధ్యక్షులుగా మన్నె లక్ష్మి, అడ్డి శోభ, కార్యదర్శులుగా పోచవోయిన కవిత, కేతావత్ లావణ్య, కార్యవర్గ సభ్యులుగా వడ్ల పద్మ, బెస్త సావిత్రి, కంది సాయవ్వ, బండ ఎల్లవ్వ, కాట్రోత్ అంగూరిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడారు. మండలంలో మహిళలను చైతన్య పర్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకులు ఎల్లమయ్య, భైరయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల నిర్మాణానికి కొలతలు



**ఎల్లారెడ్డిరూరల్:** తిమ్మాపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి గాను నాయకులు కొలతలు తీసుకున్నారు. ఈ పనులను మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్ ఆదివారం పరిశీలించారు. గ్రామంలో జెడ్పీటీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో సీసీ రోడ్డు వేయనున్నట్లు ఉషాగౌడ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

### బహుమతుల ప్రదానం



**కామారెడ్డి అర్బన్:** స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతి ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా చాలీసాను కంఠస్థం చేసిన పిల్లలకు కౌన్సిలర్ విజయభాస్కర్ గౌడ్, శ్రీరామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి చేతుల మీదుగా బహుమతులు అందించారు. చిన్నప్పటి నుంచి భక్తిభావనలు, పారాయణాలు కంఠస్థం చేయడం ద్వారా పిల్లల్లో అపారమైన జ్ఞాపకశక్తి పెరుగుతుందని శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి అన్నారు.

### యోగా టీచర్ ట్రైనింగ్ పరీక్షలు



**కామారెడ్డి అర్బన్:** జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ బాబారాందేవ్ హరిద్వార్ పతంజలి యోగా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా టీచర్ ట్రైనింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. పరీక్షల్లో 13 మంది పాల్గొనగా వీరికి ఈ నెల 18 నుంచి ఆయుష్ శాఖ ద్వారా యోగా సర్టిఫికేషన్ బోర్డు, ధ్రువపత్రాలు అందిస్తుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి తెలిపారు. యోగా పరీక్షలను యోగా గురువు అంజయ్య గుప్తా, జి.అంజయ్య, గురుచరణ్, హిమబిందు తదితరులు పర్యవేక్షించారు.

### ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం



**పిట్లం(జుక్కల్):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 14 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్ నిర్ధారణ అయిన నలుగురికి డాక్టర్ రష్మిత కౌన్సిలింగ్ చేసి ఒక నెలకు సరిపడా మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి బాలు, రాజ్‌కుమార్, సంతోష్, ఆస్పత్రి డైరెక్టర్లు సుభాకర్, దయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

**తాడ్వాయిలో చిన్న పిల్లలకు..**



**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత చిన్న పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి కామారెడ్డిలోని ఆర్కే చిన్న పిల్లల ఆస్పత్రికి చెందిన డాక్టర్ రమేష్ వచ్చి పిల్లలకు వైద్య చికిత్సలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా 150 మంది పిల్లలకు వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వీడీసీ చైర్మన్ మేకల రాజు, విశ్వబ్రాహ్మణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కమ్మరిరాజు, కమ్మరి నర్సింలు, రవి కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సముందర్ తండాలో ..



బూరుగుపల్లిలో ..



చిన్నదేవిసింగ్‌తండాలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ మురికి

# మూలనపడ్డ జీపీ ట్రాక్టర్లు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- రోడ్లపై పారుతున్న మురికి నీరు
- కుంటుపడిన గ్రామాల అభివృద్ధి
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



శివాపూర్‌లో మూలనపడ్డ జీపీ ట్రాక్టర్ ట్రాలీ

**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో వీధులు, మురికి కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి మురికి రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఎక్కడ చూసినా కుళ్లిన వ్యర్థపదార్థాలు దర్శనమిస్తున్నాయి. చెత్త తరలించాల్సిన పంచాయతీ ట్రాక్టర్లు మూలనపడ్డాయని, ట్రాక్టర్లు వాడకంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత ప్రభుత్వం గ్రామాలలో చెత్తా చెదారం తొలగించి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో రూ.లక్షలు పెట్టి ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను కేటాయించింది. కాని ఇప్పుడు ట్రాక్టర్లు వాడకపోవడంతో పూర్తిగా మూలన పడుతున్నాయి. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో చిన్నదేవిసింగ్ తండా, సముందర్ తండా, బూరుగు పల్లి, శివాపూర్, పోచారం తండా, పోచారం, కాటేపల్లి తండా, కాటేపల్లి, బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, పెద్ద దేవిసింగ్ తండా, కూబ్యనాయక్ తండా, లింగం పల్లి, విఠల్‌వాడి, విఠల్ వాడితండా, అంజని గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్లు మూలనపడి ఉన్నాయి. అన్ని గ్రామ పంచాయతీలలో ఎక్కడ చూసినా ఈ మధ్య చెత్తాచెదారం కుళ్లి రోడ్ల మీద మురికి నీరు పారుతున్నాయి. అలాగే వీధిలైట్లు కూడా వెలగడం లేదని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. పారిశుధ్య లోపం వల్ల దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలన పడ్డ పంచాయతీ ట్రాక్టర్లను బయటకు తీసి మరమ్మతులు చేయించి వెంటనే పారిశుధ్య పనులు మొదలు పెట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

**నిధులు లేవు అంటున్న ఎంపీవో**

ఏ చిన్న పని చేయించాల్సినా నిధులు అవసరం ఉన్నందున ఏ పనికీ ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నామని, చాలాకాలంగా గ్రామ పంచాయతీలకు నిధులే విడుదల కావడం లేదని ఎంపీవో సమాధానమిస్తున్నారు. ఏదేమైనా సంబంధిత కార్యదర్శుల ద్వారా సమస్యలను పరిష్కరించడానికి సత్వరమే ప్రయత్నిస్తానని అంటున్నారు.

# కంకర పోశారు.. తారు మరిచారు



దుమ్ము రేగుతున్న బోర్లం రోడ్డు

**బాన్సువాడ రూరల్:** మండలంలోని బోర్లం–బోర్లం క్యాంపు గ్రామాల మధ్య బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో ఏడాదిన్నర క్రితం మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డును విస్తరించి కంకర పోయడంతో గ్రామస్తులు సంతోషించారు. కాని వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఏడాది కాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. పోసిన కంకర కాస్త పౌడర్‌గా మారి వాహనాలు వెళ్తుంటే దుమ్మురేగుతోంది. భారీ వాహనాలు వెళ్తుంటే వెనుక లేస్తున్న దుమ్ము, ధూళితో ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈరోడ్డుపై ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన గ్రామానికి చెందిన సత్తిరెడ్డి అనే వ్యక్తి ఇటీవల ప్రమాదంలో గాయపడి మృత్యువాత కూడా పడ్డాడు. అధికార యంత్రాంగం స్పందించి వెంటనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి విజయం తథ్యం



**బాన్సువాడ రూరల్:** క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం పక్కా అని ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని దెగ్లూర్ అసెంబ్లీ నియోజకవర్గం బిలోలిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదే అని అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు కాంగ్రెస్ కూటమి అభ్యర్థులకు ఓటు వేసేవిధంగా చైతన్య పర్చాలన్నారు. దెగ్లూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నివర్తిరావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మైనార్టీ సెల్ కామారెడి జిల్లా అధ్యక్షుడు ఖాలెక్, నాయకులు అజీం, జమాల్ తదితరులున్నారు.

### మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



**బాన్సువాడ రూరల్:** మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కామారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గాదె సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఇబ్రహీంపేట్ గ్రామ చెరువులో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి 100 శాతం సబ్సిడీతో ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈసారి టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరగడంతో మత్స్యకార్మికులకు నాణ్యమైన చేపవిత్తనాలు సరఫరా అవుతున్నాయన్నారు. మత్స్యకార్మికులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు సాయిరెడ్డి, సాయిలు యాదవ్, గజ్జెల రమేష్, పాల్కి సాయిలు, ఏ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న షబ్బీర్ అలీ

**కామారెడ్డి టౌన్/భిక్కనూరు/దోమకొండ:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 150 మందికి పైగా లబ్ధిదారుల ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు గోనె శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్, తిర్మల్‌గౌడ్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

**బాధితురాలికి ఆర్థిక సహాయం**

**కామారెడ్డి టౌన్:** జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీలో వారం రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు కాలిపోయిన బాధితురాలు నర్సవ్వకు ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇంటి పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**ఫంక్షన్ హాల్ ప్రారంభం**

**కామారెడ్డి టౌన్:** జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్‌లో నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేతులు మీదుగా ఆదివారం ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మసూద్ అలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు చేయూత



**కామారెడ్డి రూరల్:** తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలతో మత్స్యకారులకు చేయూత లభిస్తుందని లింగాపూర్ మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు కాశబోయిన బాగయ్య పేర్కొన్నారు. ఆదివారం లింగాపూర్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో లింగాపూర్ ఊర చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కట్ల, రోహు, బంగారు రకాలకు చెందిన 19,500 చేప పిల్లలను విడుదల చేశారు. ఉపాధ్యక్షుడు కాశబోయిన వెంకటి, కార్యదర్శి ఇమ్మడి నర్సింలు, సభ్యులు కే.నవీన్ కుమార్, కోడూరి కృష్ణ, కోడూరి సిద్దిరాములు, సీహెచ్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### బీడీ కార్మికులకు జీవన భృతి అందించాలి



**కామారెడ్డి రూరల్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక పెన్షన్‌లను రెండింతలు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి 11 మాసాలు గడుస్తున్నా పెన్షన్ల పెంపుదల విషయాన్ని పట్టించుకోవడం లేదని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం విమర్శించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు పెన్షన్‌లను వెంటనే పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు కటాఫ్ తేదీ పెట్టకుండా పీఎఫ్ కార్డు ఉన్న అందరికి పెన్షన్ అందించాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రవీందర్, ఎస్కే హసన్, సిద్దిరాములు, బాలామణి, లక్ష్మి, తదితరులున్నారు.

### హామీలను అమలు చేయాలి



**కామారెడ్డి టౌన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ప్రతీ గ్రామంలో జెండాలను ఎగరేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శులు బాల్‌రాజు, దుబాస్ రాములు, నాయకులు దేవయ్య, ఈశ్వర్, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

### భయాందోళనకు గురిచేస్తున్న గ్రామ సింహాలు



**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ సింహాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఎన్‌డీసీసీ బ్యాంకు, అంబేడ్కర్ చౌరస్తా, మోతిగైని, మెంగారంగైని, ఎల్లమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. వాహనాలు అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి శునకాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

### ఆలయానికి విరాళం అందజేత

**దోమకొండ:** మండల కేంద్రంలోని నల్లపోశమ్మ ఆలయానికి ఆదివారం గ్రామానికి చెందిన మేర్గు విజయ–యాదగిరి దంపతులు రూ.10,111 విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆశంశెట్టి పోశయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు పన్యాల బాపురెడ్డి, బుర్రి రవికుమార్, ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్, గ్రామస్తులు మేర్గు సూరజ్, శ్వేత, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దంపతులు

# ప్రజలు సర్వేకు సహకరించాలి



చిన్నదేవిసింగ్ తండాలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ దశరథ్



దొంగ్లీలో.. తహసీల్దార్ రేణుక



రాజంపేటలో.. తహసీల్దార్ అనిల్ కుమార్



గాంధారిలో .. ఎంపీడీవో రాజేశ్వర్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు కోరారు. ఆదివారం జిల్లాలో జరుగుతున్న సర్వేను క్షేత్రస్థాయిలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. సర్వే సందర్భంగా తలెత్తిన సందేహాలు, సమస్యలను నివృత్తి చేశారు. ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



మీసాన్‌పల్లిలో .. ఎంపీడీవో ప్రకాష్



చీనూర్‌లో .. ఎంపీడీవో ప్రభాకరచారి



రాంపూర్ గడ్డ తండాలో.. ప్రత్యేకాధికారి లక్ష్మీ ప్రసన్న



బాన్సువాడలో.. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్



లింగంపేటలో ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు



సదాశివనగర్‌లో..

**సరంపల్లిలో సత్యసాయి బాలవికాస్**



**కామారెడ్డి అర్బన్:** విద్య అంతిమ లక్ష్యం వ్యక్తిత్వ వికాసం కావాలని, విద్యార్థులను ఉత్తమ వ్యక్తులుగా నిలబెట్టడానికి శ్రీసత్యసాయి బాలవికాస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సరంపల్లి పాఠశాలలో బాలవికాస్ కార్యక్రమం నిర్వహించగా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


## సంక్షిప్తం

**జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చుక్కాపూర్ విద్యార్థి**



**మాచారెడ్డి :** జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చుక్కాపూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి శివాయిపల్లి ప్రణయ్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రసూల్ ఆదివారం తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. ఈ సందర్భంగా చుక్కాపూర్ గ్రామస్తులు అభినందించారు.

**రామస్వామి మృతి సాహితీలోకానికి తీరని లోటు**



**కామారెడ్డి అర్బన్:** సాహితీ బంధువు, పుస్తక ప్రియుడు, నిజామాబాద్‌లో అరుణ బుక్ హౌస్, రజని పబ్లికేషన్స్, ఇందూరు భారతి, ఆదర్శ కళాసమితి వ్యవస్థాపకుల్లో ఒకరైన మేక రామస్వామి(90) మృతి సాహితీ లోకానికి తీరని లోటని ప్రముఖ కాలమిస్ట్ డాక్టర్ జి.లచ్చయ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేటలో జన్మించిన రామస్వామి శనివారం మృతి చెందారు. అభ్యుదయవాదిగా, గాంధేయవాదిగా, ఆలోచనల్లో విప్లవ భావాలు కల్గిన రామస్వామి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. అనంతరం సంతాపం తెలిపారు.

**రైతులకు వెన్నుదన్నుగా ఉంటాం**



**మద్నూర్(జుక్కల్):** రైతులకు వ్యవసాయంలో వెన్నుదన్నుగా ఉంటామని ఆదర్శ రైతు కమిటీ నూతన అధ్యక్షుడు గంగారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మేనూర్ గ్రామ ఆదర్శ రైతు కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వారు తెలిపారు. ఆదర్శ రైతు కమిటీ అధ్యక్షుడిగా గంగారాం, ఉపాధ్యక్షుడిగా గిరి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ పటేల్, కోశాధికారిగా నాగేశ్, సభ్యులుగా మల్లికార్జున్, యాదవ్, మష్టాజీ, విఠల్, సాయిలు ఎన్నికయ్యారు.

**కష్టకాలంలో ఉన్న కార్యకర్తలకు భరోసా**



**నిజాంసాగర్(జుక్కల్):** ఆపత్కాలంలో ఉన్న కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బేగరి రాజును మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఐదు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌తో రాజుతో పాటు బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే భరోసా నిచ్చారు. నాయకులు దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి, గైని విఠల్, రమేష్‌గౌడ్, యాటకారి నారాయణ, కమ్మరికత్త అంజయ్య, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.